నల్లకలువ

"గుడ్ మార్నింగ్ డాక్టర్!"

కల్పన ఆలోచనలతో పరధ్యానంగా నడుస్తున్న కేశవ్ ఉలిక్కిపడి చూశాడు.

ఎదురుగా పది గజాల దూరంలో డాక్టర్ సుభద్ర నిల్చుంది.

"గుడ్ మార్నింగ్! మెటర్నటీ వార్డ్ కా?" అన్నాడు నవ్వుతూ.

"అవును. అన్నట్టు నాకు పార్టీ ఎప్పుడు?" కుతూహలంగా అంది సుభద్ర.

"త్వరలోనే." నవ్వేశాడు కేశవ్.

"కంగ్రాచ్యులేషన్స్" మెల్లగా అంది సుభద్ర.

"థాంక్స్!"

ఇద్దరూ మాట్లాడుకుంటూ దారులు చీలారు.

నిన్న సాయంత్రం పెళ్ళి చూపుల కెళ్ళొచ్చాడు కేశవ్. పెళ్ళికూతురు కల్పన ఎంతో నచ్చిందతనికి.

సుభద్రని, కల్పనని పక్క పక్కన ఊహించుకుని నవ్వుకున్నాడు. చీకటికి, వెలుతురికి ఉన్నంత తేడా ఉందనుకున్నాడు.

డాక్టర్ సుభద ఓ పేద బడిపంతులి తొలి సంతానం. రిటయిర్రైన తండ్రికి, ఆయన కన్న మరో నలుగురు సంతానానికి ఆమే ఆధారం.

తల్లి పోవడంతో ఆ పిల్లలకి తానే తల్లయి పెంచింది. నల్లని నలుపు, విశాలమైన నుదుట యేదో గీసుకున్న మచ్చ. నల్లని పెద్ద కళ్ళలోని అమాయకత్వం ఆమె డాక్టరంటే ఓ పట్టాన నమ్మనివ్వదు.

కేశవ్ వాళ్ళ బంగ్లా కానుకుని వున్న ఓ చిన్న డాబా ఇంట్లో అద్దెకుంటోంది.

కల్పన నిమ్మపండు ఛాయ.

విశాల నేత్రాల్లో అల్లరి, చిలిపితనం పోటీ పడు తూంటాయి.

ఓ లక్షాధికారి ఏకయిక ముద్దుల పట్టి.

కల్పనని చూసిన దగ్గ్నించి కేశవ్ మనసు మనసులో లేదు. కళ్ళు తెరిచేనా, మూసినా కల్పన రూపమే మెదిలి అల్లరి పెట్టేస్తోంది.

వెంటనే పిల్ల నచ్చిందని చెప్పేద్దామనుకున్న కేశవ్ ఆమెతో ఏకాంతంగా ఓ పది నిమిషాలు మాట్లాడాలన్న కోరికతో తన అంగీకారాన్ని కాస్త వాయిదా వేశాడు.

అది కల్పనకూడా నచ్చడంతో ఫలానారోజు ఫలానా చోట కలుసుకోవాలని నిర్ణయం జరిగిపోయింది.

అయితే అదృష్టవశాత్తు అనుకోకుండా కేశవ్, కల్పనలు ముందే కలుసుకున్నారు.

కల్పన ఫ్రెండ్స్‌తో పిక్‌నిక్ కెడితే అదే చోటికి కేశవ్ కూడా రావడం తటస్థించింది.

కేశవ్‌ని ఫ్రెండ్స్‌కి పరిచయం చేసింది కల్పన. పెళ్ళి చూపులప్పటికంటే మరీ అందంగా కనిపిస్తున్న కల్పనని చూసి మురిసిపోయాడు కేశవ్.

అందరూ కలిసి ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు.

పేకాడుకున్నారు.

టేప్ రికార్డర్ పెట్టుకున్నారు.

ప్రొద్దుగూకుతుండగా లేచారు వెళ్ళడానికి.

అయితే...ఓ తమాషా ఆట చూపిస్తామని అందరూ కేశవ్‌ని గెస్ట్‌హౌస్‌కి తీసికెళ్ళారు.

* * *

కల్పన దగ్గిర్నించి వచ్చింతర్వాత కేశవ్‌కి అన్నం తిన బుద్ధి కాలేదు.

కంటిమీదికి కునుకు రాలేదు.

ఆమెను పెళ్ళిచూపులు చూసొచ్చిననాటికంటే గొడవ పెట్టిందతని హృదయం.

తెల్లవార్లూ కలతనిద్రతో, ఆలోచనల్తో గడిపిన కేశవ్ నిర్ణయానికొచ్చి ఉత్సాహంగా లేచాడు.

వెంటనే కల్పనకి, ఆమె ఫ్రెండ్స్‌కీ సాయంత్రం అయి డింటికి రమ్మని ఫోన్ చేశాడు.

పీకేయమాలో మంచి పిక్చరుందని, తప్పకుండా రమ్మని ఆహ్వానించాడు.

తన ఫ్రెండ్స్‌నికూడా కొంతమందిని పిల్చాడు. అందమైన అతని ఆలోచనల్లో నల్లకలువ సుభద్ర కూడా మెదిలి ఫ్యాన్ చేత ఆవిడకూడా కబురుచేశాడు.

తల్లిదండ్రులు ఏదో పెళ్ళి కెళ్ళడంతో...అతి ఉత్సాహంగా ఏర్పాట్లు పూర్తిచేశాడు.

*　　　*　　　*

సాయంత్రం అయిదున్నర అయింది.

కేశవ్ ఫ్రెండ్సంతా వచ్చేశారు.

సుభద్రకూడా అప్పుడే అడుగుపెట్టింది.

"రండి!" ఆప్యాయంగా ఆహ్వానించి కూర్చోపెట్టాడు కేశవ్.

సుభద్ర పొడవైన జడ కుర్చీలోంచి పాములా జారుతోంది.

ఆమె కట్టుకున్న వెంకటగిరి చీరతో పోటీపడుతున్నాయి. ఆమె జడలోని తెల్లని జంట గులాబీలు.

ఆరౌతూండగా వచ్చింది కల్పన ఫ్రెండ్స్‌తో సహా. పరిచయ వాక్యాలయ్యాయి.

అందర్నీ ఆదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టాడు కేశవ్.

అందరికీ కుతూహలంగా ఉంది, అతను చూపించబోయే ఫిలిం యేమిటి? అని.

టిఫిన్స్, కూల్ డ్రింక్స్ సేవించడాలయిపోయాయి.

"ఇంక చెప్పాలి!" చిన్నినోరు మరీ చిన్నదిగా ముడిచి అదోలా అడిగింది కల్పన.

కేశవ్ నవ్వాడు.

అతని నవ్వు ఎంతోమంది హృదయాల్ని గిలిగింతలు పెట్టింది.

భూలోకానికి దిగివచ్చిన దేవకన్యలా మెరిసిపోతున్న కల్పనని అలా చూస్తూండిపోయింది సుభద.

"భగవంతుడెంత పక్షపాతి! అందం ఆకర్షణ, ఆస్తి అంతస్తు, చదువు సంస్కారం, అన్నీ ఒకేచోట కుప్పలా పోశాడు" మొదటిసారిగా అసూయపడింది.

"మీకు ఫిలిం చూపించే ముందు ఓ చిన్న గేమ్ చూపిస్తాను. అది మీరు చూడాలేతప్ప...మధ్యలో ప్రశ్నలు వెయ్యకూడదు!" అన్నాడు కేశవ్.

"ఓ అలాగే!" ఉత్సాహంగా అన్నారంతా.

కేశవ్ ఫ్రెండ్ ఒకతను ఓ చిన్నడబ్బా, రెండు పావురాళ్ళున్న పంజరం తెచ్చి కేశవకిచ్చాడు.

అందరూ కుతూహలంగా చూస్తున్నారు.

"ఫ్రెండ్స్! నేను చూపించబోయే ఈ రెండురకాల గేమ్స్ మీలో ఎవరికైనా తెలుసేమో నాకు తెలియదు.

కానీ...చాలా సరదాగా ఉంటాయి.

ఇదుగో యీ డబ్బాలో పది తూనీగలున్నాయి. ఈ

సూదిలో వాటి పొట్టల్లోగుచ్చి దారం చివర ముడివేసి ఓ మీటర్ దారానికి బెలూన్లలా వేలాడెయ్యాలి. ఈ పది దారాలు ఒకటిగా ముడివేసి ఓ కొక్కేనికి కట్టాలి.

అప్పుడు పది తూనీగలు, బాధతోనూ, ప్రాణభయం తోనూ ఎగురుతూంటాయి. ఈ దృశ్యం చూడ్డానికి చాలా బావుంటుంది."

"ఒక రెక్క విరిచెయ్యాలి, అప్పుడింకా తమాషాగా ఉంటుంది" కేశవ్ మాట పూర్తికాకుండానే ఉత్సాహంగా అంది కల్పన.

"ఎస్! ఎస్! నాకా అయిడియా రాలేదు" అంటూ ఓ తూనీగని, సూదిని చేతుల్లోకి తీసుకున్నాడు కేశవ్.

"ఇప్పుడు దానికి గుచ్చబోతున్నారా?" కంగారుగా అంది సుభద.

"అవును" సూదిని తూనీగ పొట్టలో గుచ్చబోతూ అన్నాడతను.

"ప్లీజ్! వద్దు" దాదాపు అరిచినట్టే అందామె.

కల్పన, ఫ్రెండ్స్ చిరాగ్గా చూశారామెకేసి.

"ఫరవాలేదు. చూడండి. చాలా సరదాగా ఉంటుంది" నవ్వుతూ అన్నాడతను.

"నో! ఐ కాంట్ సీ!"

"పోనీ మరొకటి చూపిస్తాను, దినికభ్యంతరం చెప్ప కూడదు. ఓకే!?" సూదిని, తూనీగని వాటిస్థానాల్లోవుంచుతూ అన్నాడు కేశవ్.

"అలాగే!" అన్నట్టు చూసింది సుభద. కానీ... "ఈసాకెలాంటి ఘోరం చూడాల్సొస్తుందా" అన్న భయం ఆమె కళ్ళలో స్పష్టంగా కనిపిస్తోంది.

కల్పనకి చిరాగ్గా వుంది.

"అసలు కేశవ్ ఈవిడగారి మాటలకింతవిలువ ఇవ్వడం యేమిటి?" అనుకుని మనసులోనే మండిపడింది.

"ఈ పావురాళ్ళ కాళ్ళకి తాళ్ళు కట్టి ఫ్యానుకి వేలాడ దీసి ఫుల్ స్పీడులో ఫ్యాను ఆన్ చెయ్యాలి-అప్పుడుంటుంది థ్రిల్! ఓహ్" పావురాళ్ళ కాళ్ళకి తాళ్ళుకట్టి స్టూల్ యెక్కి-వాటిని ఫ్యానుకి కట్టాడతను.

అవి కంగారుగా ఎగిరి ఫ్యానుమీద కూర్చుని బిత్తర చూపులు చూస్తున్నాయి.

సుభద వెన్నులోంచి ఒణుకువస్తోంది.

"వాటికి...దెబ్బ తగలదూ?" లోగొంతుతో అంది.

"ఎందుకు తగలదూ?" నవ్వాడతను.

"అంటే..."

"అవి ప్రాణభయంతో ఫ్యానుతో పోటీగా కాసేపు తిరుగుతాయి. పారిపోవాలని విశ్వప్రయత్నం చేస్తాయి. అఫ్ కోర్స్! కాస్సేపటికి ఫ్యాన్ రెక్కలకి బలయిపోతాయి. అది వేరేసంగతి కానీ...చూస్తున్నంతసేపూ చాలా సరదాగా ఉంటుంది" ఫ్యాన్ స్విచ్ కేసి నడుస్తూ అన్నాడతను.

"డాక్టర్" అరిచింది సుభద. ఆమెకి ఎప్పటిలా కేశవ్ని

చూస్తే ఆరాధన కలగడం లేదు. అతని నవ్వు ఆమె హృదయాన్ని గిలిగింతలు పెట్టడంలేదు.

అసహ్యం కలుగుతోంది.

విషం కక్కుతున్నట్టుంది.

"అబ్బ, ఈసారేమిటి మీ అభ్యంతరం?" విసుగ్గా చూశాడు అతను.

"ప్లీజ్! డాక్టర్! ఇంత రాక్షసప్రవృత్తి మంచిదికాదు" రెండు చేతులు జోడించింది సుభద.

ఆమె రెండు కళ్లు నీళ్ళతో నిండిపోయాయి.

"ఇందులో రాక్షసత్వం ఏముంది?"

"ఒక జీవిని హింసించటం రాక్షసత్వం కాదా?"

"తెల్లారితే వేలాది జీవులు నసిస్తున్నాయి...ఆహారం కోసం..." వ్యంగ్యంగా అంది కల్పన.

"కానీ...వారు సరదాకోసం చంపడంలేదు. అయినా మిస్ కల్పనా! మీరుకూడా శాకాహారులే ననుకుంటా!" సూటిగా చూస్తూ అంది సుభద.

"అయితే?" తీక్షణంగా చూసింది కల్పన.

"ఆఁహాఁ! జీవహింస గురించి వివరిస్తుంటేను."

"నేను శాకాహారినయినంత మాత్రాన మాంసాహారుల్ని ఆడిపోసుకోను" కఠినంగా అంది కల్పన.

"నేనూ ఆడిపోసుకోను. కానీ,మాంసం తింటున్నామని,

వాటిని చిత్రహింసచేసి ఆనందించేవాళ్ళని మాత్రం అసహ్యించు కుంటాను" నిస్సంకోచంగా అంది సుభద.

కల్పన కళ్ళు కోపంగా ఎరుపెక్కాయి.

"మీరు బ్రతికున్న కప్పల్ని వాటిని కోయలేదూ? అది చిత్రహింస కాదా? లేక అలాంటివేం కొయ్యకుండానే డాక్టరయ్యారా?" అంది హేళనగా.

"హియర్! హియర్!" చప్పట్లు కొట్టారు కల్పన ఫ్రెండ్స్.

"అంటే...అది విజ్ఞానం కోసం" గొణిగింది సుభద.

"అయితే యిది వినోదం కోసం" అంది కల్పన.

సుభద నిర్ఘాంతబోయింది.

దైవసమానమైన డాక్టర్ వృత్తికీ, జీవహింసతో పొందే పైశాచికానందానికీ పోల్చి రెండూ ఒకటేనని వాదించే కల్పనతో ఏం మాట్లాడాలో తోచలేదు సుభదకి.

ఈ సమావేశంలో తను ఇమడలేననుకున్న ఆమె మెల్లగా లేచింది.

అంతవరకు ఇద్దరి మాటల్ని కుతూహలంగా వింటున్న కేశవ్ "అరె! లేచారేమిటి?" అన్నాడు.

"సారీ డాక్టర్! నేను చాదస్తపుదాన్ని! ఇలాంటి గేమ్స్ చూసి ఆనందించేంతటి శక్తి నాకు లేదు, మన్నించండి" నాలు గడుగులు వేసింది సుభద.

"నో! నో! మీరు వెళ్ళడానికి వీల్లేదు" కేశవ్, అతని ఫ్రెండ్స్ కూడ పట్టుపట్టారు.

వారనుకునే థ్రిల్లింగ్ దృశ్యాల్ని కేన్సిల్ చేసేసి పావురాల్ని, తూనీగల్ని వదిలేశారు.

కల్పన ముఖం జేవురించింది.

అది చూసికూడా చూడనట్టు ఫ్రెండ్స్ తెచ్చిన కేసెట్స్ 'వీడియో'లో చూపించి వాతావరణాన్ని కాస్త తేలిక పరచాడు కేశవ్.

* * *

"గుడీవినింగ్ డాక్టర్!"

తనని తప్పుకు తిరుగుతున్న సుభద్రని నవ్వుతూ పలకరించాడు కేశవ్.

తనకి తానుగా ఏనాడూ పలకరించని కేశవ్ తను దూరంగా తప్పుకుంటున్నా పనివేళా వచ్చి ఆప్యాయంగా పలకరించడంతో కాస్త తికమకపడింది సుభద్ర.

"గుడీవినింగ్! ఇంటికేనా?" ఏదో అడగాలన్నట్టు అడిగింది.

"ఉహూఁ! అలా కాస్సేపు బీచ్ కెళ్ళొద్దామనుకుంటున్నాను" ఆమెకేసి పరిశీలనగా చూస్తూ అన్నాడు అతను.

"ఓ! వెళ్ళండయితే..." వాచ్ చూసుకుంటూ అంది.

"మీరుకూడా రాకూడదూ?"

"నేనా?" ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవైనాయి సుభద్రకి.

"అవును! ఏం? రాకూడదా?"

"అయాం సారీ! ఇవాళ నేను పెంద్రాళే యింటి కెళ్ళాలి" గంభీరంగా అంది సుభద్ర.

"ప్లీజ్! ఫర్ కంపెనీ సేక్!"

"నా కంపెనీ మీకు ఆనందాన్నివ్వదు." పదునుగా ఉందామె స్వరం.

"అది నిర్ణయించాల్సింది నేను."

"అంటే?" తీక్షణంగా అంది సుభద్ర.

"ప్లీజ్. నాలుగు మాటలు మీ తో మాట్లాడాలి! సరేనా?" గంభీరంగా అన్నాడు కేశవ్.

అతని కళ్ళలోని ఆర్ద్రింపుకు ఆశ్చర్యపోయింది సుభద్ర. ఇదే యింతకు ముందయితే అతని కోరిక ఆమె హృదయం మీద పన్నీరు కురిసినట్టుండేది. కానీ యిప్పుడు అతనో కిరాతకుడిలా, ధనబలంతో కళ్ళకు పొరలు కప్పిన విలాస పురుషుడిలా కనిపిస్తున్నాడు. అందుకే అతని కోరికని సున్నితంగా త్రోసిపుచ్చింది.

"మరోలా అనుకోకండి డాక్టర్! నేను నిజంగానే తొందరగా యింటికెళ్ళాలి" అంటూ.

అతని ముఖం సీరియస్‌గా అయిపోయింది.

"మిస్ సుభద్రా! పది నిమిషాలు నాతో మాట్లాడితే మీ అవున్నత్యం తగ్గిపోతుందని మీ ఉద్దేశమా?" అదోలా అన్నాడు.

"ఛ! ఛ! అదికాదు..." కంగారుగా అంది.

"మరయితే రండి." కారు డోర్ తీసి పట్టుకుంటూ అన్నాడు కేశవ్.

ఓసారి అతని కళ్ళలోకి సూటిగా చూసిన సుభద్ర మారు మాట్లాడకుండా కార్లో కూర్చుంది.

"థాంక్స్." ఉత్సాహంగా స్టీరింగ్ చేతిలోకి తీసుకున్నాడు.

బీచ్‌లో జనం పల్చగా ఉన్న చోటు చూసుకుని కూర్చున్నారిద్దరూ.

సముద్రం మీదినించి వచ్చే చల్లనిగాలి సుభద ముంగురుల్ని చెరిపేస్తున్నాయి.

"చెప్పండి." ఇసుక గుప్పెళ్ళతో తీసి ఒదులుతూ అంది సుభద.

"నేనంటే మీకు అసహ్యంగా ఉందికదూ?" హటాత్తుగా అన్నాడు కేశవ్.

ఆమె మాట్లాడలేదు. సముద్రపు టంచులు చూడ్డానికా అన్నట్టు సముద్ర గర్భంలోకి దృష్టి మరల్చింది.

"కల్పన గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

తృళ్ళిపడింది సుభద. వెంటనే తేరుకుని అదోలా నవ్వుతూ-

"మీకు తగ్గ ఇల్లాలు! 'మేడ్ ఫర్ ఈచ్ అదర్స్' అన్నట్టుంటారు మీరిద్దరూ." నొక్కి మరీ అంది.

"నో!"

"వ్వాట్?" అదిరిపడింది సుభద.

"అవును! కల్పన నాకు నచ్చలేదు."

"కారణం?" వ్యంగ్యంగా అంది సుభద. అతనిమాటలు నమ్మబుద్ధి కాలేదామెకి.

"మా మనస్తత్వాలు ఉత్తర దక్షిణ ధృవాలు."

పకుకున నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నారు?"

"సారీ, చెప్పండి." సర్దుకుని అంది సుభద.

"నేనామెతో సుఖపడలేననిపించింది! అందుకే ఆమె నచ్చలేదని డాడీతో చెప్పి లెటర్ రాయించేశాను!" అన్నాడు కేశవ్.

"ఇదంతా నాకెందుకు చెపుతున్నారు?" వింతగా చూసింది సుభద.

"నాకు నచ్చిన, నన్ను మెచ్చిన వ్యక్తిని చేసుకోవాలనుకుంటున్నాను.

"మంచిదే!" మెల్లగా అంది.

రెండు నిమిషాలు మౌనంగా దొర్లిపోయాయి.

సుభద ఆలోచనలో పడింది. ఎవరా నచ్చిన వ్యక్తి అని.

"ఆ వ్యక్తి యెవరో చెప్పనా?" ఆమె కళ్ళలోనిభావాలు చదివిన కేశవ్ మృదువుగా అన్నాడు.

చెప్పమన్నట్లు చూసింది సుభద.

"మీరే!"

"ఏమిటీ?" బిత్తరపోయింది ఆమె

"అవును. నేను ప్రేమించిన వారికంటే నన్ను ప్రేమించిన వారితోనే ఎక్కువ ఆనందం ఉంటుందనుకుంటున్నాను!"

"కా...నీ నేను మిమ్మల్ని ప్రేమించలేదు!" అభిమానంతో ఆమె ముఖం కందిపోయింది.

తియ్యగా నవ్వాడు కేశవ్.

"లేదు! మీరు అబద్ధం ఆడుతున్నారు! నన్ను మీరెంతగా ఆరాధిస్తున్నారో మీకంటే కూడా బాగా తెలుసు నాకు!"

"కానీ నన్ను ప్రేమించలేనివారు నా కక్కర్లేదు!" విసురుగా లేచింది.

మళ్ళీ నవ్వాడు కేశవ్!

"నేనో కథ చెప్తాను. ఆ కథ విన్న తరవాత కూడా అదే అభిప్రాయాన్ని మీరు వెలిబుచ్చితే ఇంక మీ వంక చూడను." చనువుగా సుభద్ర చెయ్యిపట్టి ఆపాడు.

చెయ్యి విదిలించుకుని మౌనంగా కూర్చుంది.

"నేను కల్పనని చూసిన రోజు అంత అందమయిన అమ్మాయి భార్య కాబోతున్నందుకు పొంగిపోయాను. ఆవిడని పదే పదే తల్చుకుని మురిసిపోయాను.

ఆమెతో ఏకాంతంగా కొంతసేపు మాట్లాడితే ఒకర్నొకరు బాగా అర్థంచేసుకోవడానికి అవకాశం ఉంటుందనుకున్నాను!

కానీ అనుకోకుండా మొన్నోరోజు ఆమెను ఫ్రెండ్స్‌తో ఉండగా కలుసుకున్నాను.

మా యింటికి మిమ్మల్నందరినీ ఆహ్వానించి ఏ గేమ్స్ చూపిస్తానన్నానో అవన్నీ నాకు కల్పన చూపించింది.

రెక్కలు తెగి రక్తం ఓడుతూ గిలగిల కొట్టుకుంటున్న పావురాళ్ళని చూసి చప్పట్లు కొడుతూ ఆనందిస్తున్న కల్పనని చూస్తూంటే నా కళ్ళలోంచి ఒణుకు బయల్దేరింది.

ఆ దృశ్యం చూస్తుంటే మగాడ్నయిన నాకే హృదయం గడ్డకట్టినట్లయింది ఓ ఆడపిల్ల! అదే హృదయవిదారక దృశ్యాన్ని నయనానందకరంగా చూసి ఆనందిస్తుంటే ఓహ్! నేను తట్టుకోలే పోయాను.

ఆమె అందమంతా వికృతంగా కనిపించింది.

వెంటనే మీరు గొర్తొచ్చారు.

మీ కళ్ళలోని దయ, జాలి గొర్తొచ్చాయి.

ఓ డాక్టర్‌గా, ఒక ప్రాణదాతగా రాణించాలంటే, ముఖ్యంగా నాలాటి వాడికి బాహ్య సౌందర్యం కంటే... ఆత్మ సౌందర్యమే ఎక్కువ సేద తీరుస్తుందనిపించింది.

నాకు తెలిసినంతవరకు మీ హృదయం మంచిది! నేనంటే ఆరాధన ఉంది.

అందుకే ఫ్రెండ్స్‌తో కలిసి ఓ చిన్న నాటకం ఆడాను.

కిరాతకుడిగా కాస్సేపు నటించాను.

నేను నిజంగా ఆ జీవుల్నెక్కడ హింసిస్తానో అని మీరు హడలిపోయారు. కానీ, కల్పన ప్రోత్సహించింది.

జీవితాంతం నాతో పయనించే మనిషి నాకు ఆత్మ బంధువులా ఉండాలేతప్ప ఆగర్భ శత్రువులా ఉండకూడదు.

నల్లగా ఉన్నా కోయిలలా మధుర రసాన్నొలికించాలి.

అంతేగానీ, అందంగా తాచులా ఉంటే జీవితాంతం భయంతోనో బ్రతకాలి.

మీకభ్యంతరం లేకుంటే నేను మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటాను" ముగించాడు కేశవ్.

నిర్ఘాంతపోయింది సుభద!

ఆమె కళ్ళలో చెప్పలేనంత వెలుగు!

ఇప్పుడామె కళ్ళకి అతను ఓ అవతార పురుషుడులా ఉన్నాడు.

"డాక్టర్!" గొణిగింది.

"నేను తొందరపడ్డానా?"

"నో...కానీ...నేను...పేద..."ఆమె మాట పూర్తి కానే లేదు.

"కానీ...నేను కాస్త ఉన్నవాణ్నే మనం హాయిగా ఉండడానికది చాలు. జీవితాంతం మనం తోడూ నీడగా ఉందాం నిజాయితీ ఉట్టిపడుతోందతని గొంతులో.

"కానీ"

"మీ బాధ నాకు తెలుసు. మీరు లేకపోతే మీ

వాళ్ళ కాధారం లేదు. కానీ మనం ఒకటైతే మీవాళ్ళూ, మావాళ్ళూ అంతా మనవాళ్ళే." సుభద్ర కేశవ్ మాటలలోని మృదుత్వానికి ఆశ్చర్యపోయింది.

"ఇది నిజమా లేక కలగంటున్నానా?" అయోమయంగా అంది.

"నో! ఇది కలకాదు. నూటికి నూరుపాళ్ళూ నిజం. మిస్ సుభద్ర త్వరలో మిస్సెస్ సుభద్రా కాబోతోంది." ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ అన్నాడు కేశవ్.

ఆనందంతోనూ, సిగ్గుతోనూ ఆమె కళ్ళు వాలిపోయాయ్. నల్లని చెంపలు వింతగా మెరిసాయి!

సిగ్గుతో తల దించుకున్న సుభద్ర ఎంతో అందంగా, మరెంతో ఉన్నతంగా కనిపించింది కేశవ్ కళ్ళకి.

"పై మెరుగులకె భ్రమపడకోయీ, మనసే మాయని సొగసోయి" అన్న పాట దూరాన ఎక్కణ్నించో మృదు మధురంగా వినిపిస్తోంది.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక)